సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం ၊ 16 ၊ డిసెంబర్ ၊ 2023



దేదీప్యమానం..దీపోత్సవం
చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయ ప్రాంగణంలో 40 వేల జ్యోతులతో దీపోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. 8లో



ఘనంగా అప్పన్న తిరువీధి
సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో విశేషంగా తిరువీధి ఉత్సవం నిర్వహించారు. 8లో



వైభవంగా వారాంతపు పూజలు
విశాఖ రుషికొండలోని వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సభ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్, చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లి రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి త్వరలో చింతపల్లిలో పర్యటించనున్నట్లు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె కలెక్టర్ సుమిత్ కుమార్, చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్‌తో కలిసి సభ ఏర్పాటుకు,హెలీప్యాడ్ కోసం స్థల పరిశీలన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది ఎనిమిదోవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేసిన విధంగానే ఈ ఏడాది కూడా పంపిణీ చేసేందుకు చింతపల్లి విచ్చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేసిన పాఠశాలలను, గిరిజనులకు అందుతున్న సంక్షేమ ఫలాలను ఆయన పరిశీలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూష దేవి, సర్పంచ్ దురియా పుష్పలత, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రాజు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన తప్పనిసరి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న పీవో అభిషేక్

అరకులోయ రూరల్: ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందికి ఈవీఎంల వినియోగంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఈవీఎంలపై ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, వీఆర్వోలు, వీఆర్ఏలు సిబ్బంది పాల్గొన్నారు.

రాగుల కొనుగోలు కేంద్రం పరిశీలన



రాగుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ జాహ్నవి

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రాగుల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయశాఖ చింతపల్లి ఏడీ కె.జాహ్నవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గిట్టుబాటు ధరకు రైతుల నుంచి రాగులు కొనుగోలు చేస్తుందన్నారు. ఇప్పటికే తుపానులో నష్టపోయిన రైతుల వివరాలను సేకరించామన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు పంట ఉత్పత్తులను విక్రయించాలని ఆమె సూచించారు. మండల వ్యవసాయాధికారి మధుసూదన్ పాల్గొన్నారు. అంతకు ముందు వ్యవసాయ సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంట నష్టం అంచనాలను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరూ రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ రైతులకు సలహాలు, సూచనలు అందివ్వాలని ఆమె ఆదేశించారు. పంట నష్టం వివరాలను ఆమె తెలుసుకున్నారు.

టీబీ బాధితులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

- 200 మందికి అందజేత



బాధితులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న విశ్వేశ్వరనాయుడు

సాక్షి,పాడేరు: జిల్లాలో గుర్తించిన 200 మంది టీబీ బాధితులకు డ్రైరేషన్ పౌష్టికాహారం కిట్లను విశాఖకు చెందిన ఇసిన్‌టియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ సంస్థ అందుబాటులోకి తెచ్చింది. ప్రొటీన్ పౌడర్, రాగి, కందిపప్పు, వంట నూనె, గోధుమపిండి, వేరుశనగ పల్లీలు, ఖర్జూరంతో కలిపి ఉన్న ఈ కిట్ ఖరీదు రూ.700 ఉంటుందని టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ తమర్బ విశ్వేశ్వరనాయుడు తెలిపారు. పాడేరు పరిధిలోని బాధితులకు శుక్రవారం ఆయన కిట్లను పంపిణీ చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో
సత్వర వైద్యం



గిరిజనులకు బీపీ,హెచ్‌బీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- 297 శిబిరాల్లో 99,214 మందికి మెరుగైన సేవలు
- 41,402 మందికి హెచ్‌బీ పరీక్షలు
- 1987 మందికి ఉన్నతి వైద్యం
- మారుమూల గ్రామాల ప్రజలకు వరంలా శిబిరాలు

సాక్షి,పాడేరు: గ్రామాలలో సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలికంగా పలు రుగ్మతలతో బాధపడే గిరిజన ప్రాంత ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు వరంలా మారాయి. అక్టోబర్ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో 297 శిబిరాలను వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించింది. పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, 250 మంది వైద్య నిపుణులు సేవలందించారు.

ముందస్తుగా సర్వే..

అనారోగ్య సమస్యలతో బాధపడే రోగుల వివరాలను సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లంతా తెలుసుకుని వారికి జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామ సచివాలయాల పరిధిలోని నిర్వహించే వైద్యశిబిరాలకు హెల్త్ కార్డులు పొందిన రోగులకు సకాలంలో అవసరమైన వైద్య సేవలు అందించారు.

22 మండలాల పరిధిలో

జిల్లాలోని 22 మండలాల పరిధిలో 297 జగనన్న సురక్ష వైద్యశిబిరాల ద్వారా 99,214 మందికి మెరుగైన వైద్యసేవలు అందించారు. వీరిలో 41,402 మంది యువతులు, మహిళలకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. తద్వారా రక్తహీనత ఉన్న వారిని గుర్తించి మందులు పంపిణీ చేస్తున్నారు.

నేత్ర పరీక్షలు..

జిల్లాలో నిర్వహించిన 17,767 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. కంటి సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులను పాడేరు జిల్లా ఆస్పత్రితో పాటు విశాఖలోని పలు నేత్ర వైద్యశాలలకు రిఫర్ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగులోను సుమారు రెండు వేల మందికి పాడేరు జిల్లా ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు జరిపారు. పలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు వైద్యనిపుణులు పరీక్షలు చేయడంతో 1987 మంది రోగులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉన్నత వైద్యసేవలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.విశాఖలోని పలు కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేయడంతో వారంతా సత్వర ఉన్నత వైద్యసేవలు పొందగలిగారు.



మోదాపుట్టులో గిరిజనులకు వైద్యసేవలు కల్పిస్తున్న ఆర్థోపెడిక్ వైద్యనిపుణుడు



అరకులోయలో జగనన్న సురక్ష వైద్యశిబిరానికి బారులు తీరిన గిరిజనులు (ఫైల్)

చూపు మెరుగుపడింది



కళ్లు సరిగ్గా కనబడక ఇబ్బందులు ఎదురయ్యేవి.పెదబయలులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇటీవల పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి ఇటీవల కుడి కంటికి ఆపరేషన్ చేశారు.

– కాకర లక్ష్మయ్య, పెదబయలు

రక్తహీనతకు మందులిచ్చారు



తరచూ అనారోగ్యంతో బాధపడే నేను మోదాపుట్టు హాస్టల్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో వైద్యసేవలు పొందాను. హెచ్‌బీ రక్తపరీక్షల్లో రక్త హీనత సమస్యను గుర్తించారు. నివారణకు అవసరమైన మందులు ఇచ్చారు.

– పాంగి సితో, ఎగువమోదాపుట్టు, పాడేరు మండలం

రోగుల వైద్యంపై పర్యవేక్షణ



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల ద్వారా వైద్యసేవలు పొందిన రోగులకు హెల్త్ కార్డులను పంపిణీ చేశాం. బీపీ, సుగర్ సమస్యలతో బాధపడే వారికి రోజువారీ మందులు వినియోగించేలా ఆశా కార్యకర్తలు చర్యలు తీసుకుంటున్నారు.

– డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, పాడేరు

పెండింగ్ దరఖాస్తులపై దృష్టి పెట్టండి

కలెక్టర్ సుమిత్‌కుమార్



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ఎన్నికల జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం 6,7,8 దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లాలోని ఎన్నికల విభాగం సహాయ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లలో మృతుల తొలగింపుపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ సౌకర్యాలు, ఇతర సమస్యలపై నివేదికను అందజేయాలన్నారు.పోలింగ్ కేంద్రానికి రహదారి, సిమెంటు ర్యాంప్, విద్యుత్ సౌకర్యాలపై పరిశీలించి నివేదికలో పొందుపరచాలన్నారు. ఇప్పటివరకు తొమ్మిది మండలాల నుంచి మాత్రమే నివేదికలు వచ్చాయన్నారు. మిగిలిన ప్రాంతాల వారు నివేదికలు త్వరితగతిన పంపాలని ఆయన ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ మాట్లాడుతూ డబల్ ఎంట్రీ, జీరో డోర్ నంబర్‌తో ఓటర్లు, ఒకే ఇంట్లో పదికంటే ఎక్కువ ఓటర్లను గుర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు

జిల్లా వ్యాప్తంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు,ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు పదివేల వ్యక్తిగత మరుగుదొడ్లు అవసరం ఉన్నట్టు అంచనా వేయడం జరిగిందన్నారు.పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లంతా గ్రామాల్లో సర్వేలు జరిపి మరుగుదొడ్ల అవసరాలను గుర్తించాలన్నారు. వీటి వివరాలను స్వచ్ఛ ఆంధ్ర వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్లను 4/3 అడుగుల సైజులో నిర్మిస్తే రూ.12వేలు, 6/4 అడుగులలో నిర్మిస్తే రూ.15వేలను లబ్ధిదారులకు రెండు దశల్లో వారి బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లించాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



వర్ధంతి కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తదితరులు

రంపచోడవరం: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రం కోసం అమరణ దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు అని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆయన వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ కార్యాలయాల్లో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు.

విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక సదరం శిబిరాలు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక సదరం శిబిరాలు నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ వెల్లడించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల కోసం గతంలో నిర్వహించిన సదరం శిబిరాల ద్వారా 500 మందికి లబ్ధి చేకూరిందన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఎప్పుడైన తనను నేరుగా కలవవచ్చునన్నారు. మండల పరిధిలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి ఆయన చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దివ్యాంగుల కోసం మండల పరిధిలో పని చేస్తున్న పలు ప్రభుత్వేర సంస్థల ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

రాగుల కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం

- దళారులకు అమ్మి మోసపోవద్దు
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ, అధికారులు

అరకులోయ టౌన్: గిరి రైతులు రాగులను దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆశ్రయించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గిరి రైతులు పండించిన రాగులకు గిట్టుబాటు ధర కలిప్పించాలనే ఉద్దేశంతో కిలో రాగులు రూ.38.40కు కొనుగోలు చేస్తుందన్నారు. అరకులోయ మండలంలో కొత్తభల్లుగుడ, గన్నెల, అరకులోయలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోం చేసుకోవాలని ఆయన కోరారు. రాగులు విక్రయించిన వెంటనే రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. వ్యవసాయశాఖ ఏడీ మోహన్‌రావు మాట్లాడుతూ మాట్లాడుతూ రాగులు విక్రయించాలనుకునే రైతులు వ్యవసాయశాఖ ఏవోను 83310 56453 నంబరులో సంప్రదించాలని కోరారు. వరి, రాగులు పంట కోత కోయకుండా ఉంటే నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. కోత కోసి, కుప్పపెట్టిన రైతులకు ఇన్సూరెన్స్ వస్తుందన్నారు. ఏవో ఫణి, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న పాల్గొన్నారు.



పోటెత్తిన పర్యాటకులు

వంజంగి హిల్స్ ప్రాంతానికి శుక్రవారం వేకువజాము నుంచే పర్యాటకులు భారీగా చేరుకున్నారు. వంజంగి శిఖరాల నుంచి సూర్యోదయం, పొగమంచు, మేఘాల అందాలను వీక్షించి కొత్త అనుభూతిని సొంతం చేసుకున్నారు. సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు.

– సాక్షి, పాడేరు

ఉప్మాకు బదులు ఫ్రైడ్ రైస్

ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆదేశం



కొత్తూరు కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థినులతో మాట్లాడుతున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

అనంతగిరి: విద్యార్థులకు మెనూలో భాగంగా గురువారం ఉదయం పెట్టే ఉప్మాకు బదులుగా ఫ్రైడ్‌రైస్ పెట్టాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన కొత్తవలస గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలోని స్టాక్‌రూమ్ పరిశీలించారు. అనంతరం కొత్తూరు కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. స్టాక్ నిల్వలను పరిశీలించారు. కొంతసేపు విద్యార్థినులతో మాట్లాడారు. మెనూ అమలుపై విద్యార్థులనుంచి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటుగా పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం రాజీ పడటం లేదన్నారు. దీనిని విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. చదువుతోనే భవిష్యత్తు ఉంటుందన్నారు. అక్కడ నుంచి చిలకలగెడ్డ గిరిజన సంక్షేమ బాలురు పాఠశాలకు వెళ్లి, విద్యార్థులతో ముచ్చటించారు. ఉప్మాకు బదులుగా ఫ్రైడ్ రైస్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో వెంకటరావు, ఎంఈవో బాలాజీ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చైతన్య

చింతూరు: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సూచించారు. మండలంలోని పెగ పంచాయతీ అల్లిగుడెం గ్రామంలో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి దాన్యానికి రూ.2183 గిట్టుబాటు ధర నిర్ణయించిందని, ఈ మేరకు కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు జరిగిన వెంటనే సదరు రైతుకు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రశీదు అగ్రికల్చర్ అసిస్టెంట్ నుంచి పొందవచ్చన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి అవకతవలకు అవకాశం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పేగ సర్పంచ్ చంద్రయ్య, అల్లిగూడెం గ్రామస్తులు పలు సమస్యలను పీవో దృష్టికి తీసుకువెళ్లారు. వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికను అందిపుచ్చుకోవాలి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- ట్యాబ్‌లపై దుష్ప్రచారం చేస్తున్న ఈనాడు వైఖరిపై ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: మారుతున్న ప్రపంచంలో సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ట్యాబ్‌ల కారణంగా విద్యార్థులు చెడుపోతురన్నారని ఈనాడులో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు, అభివృద్ధికి ఎంత ప్రాధాన్యమిస్తోందో అదేవిధంగా విద్యార్థుల ఎదుగుదలకు అంతకు మించి ప్రాధాన్యమిస్తోందన్నారు. విద్యార్థులు ట్యాబ్‌ల వల్ల చెడుపోతున్నారన్న ఈనాడు కథనాన్ని ఆమె పూర్తిగా ఖండించారు. మారుతున్న సమాజంలో విద్యార్థులు టెక్నాలజీని అలవాటు చేసుకుంటేనే సాంకేతికంగా ఎదుగుదల ఉంటుందన్నారు. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం ఎంతో కృషి చేసి ట్యాబ్‌లు అందజేసి వారి జ్ఞానాన్ని మరింత పెంపొందిస్తుంటే పచ్చ మీడియా ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. ప్రతి విషయంలో మంచితో పాటు చెడు కూడా ఉంటుందని, పచ్చమీడియా మాత్రం మంచిని వదిలి చెడును చూపించడం తగదన్నారు. స్థోమత కలిగిన పిల్లలు సర్కారు బడుల్లో చదువుతున్నారన్నారు. అదేస్థాయిలో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన సాంకేతికతతో కూడిన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అధ్వానంగా ఉన్న పాఠశాలలను నాడు–నేడు పథకంలో పూర్తిస్థాయిలో ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. గత ప్రభుత్వంలో పాఠశాలల పరిస్థితి ఎలా ఉండేదో అందరికీ తెలుసునన్నారు. తమ ప్రభుత్వంలో జరుగుతున్న విప్లవాత్మక మార్పులు టీడీపీకి, పచ్చ మీడియాకు కనిపించడం లేదా అని ధ్వజమెత్తారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి ఎంపీపీలు అనూషదేవి, కుమారి, సర్పంచ్ దురియా పుష్పలత, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మోరి రవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ మీరా, ఎంపీటీసీలు ధారలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ఉద్యోగాలకు 74 మంది ఎంపిక



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ఐటీడీఏ పీవో అభిషేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజన నిరుద్యోగ యువత జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకొని స్థిరమైన భవిష్యతును ఏర్పరచుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాలో 11 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 174 మంది అభ్యర్థులు హాజరుకాగా వీరిలో 74 మంది ఎంపికయ్యారు. వీరికి ఐటీడీఏ పీవో అభిషేక్ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) అనిల్ పులిపాటి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడిన కారు



డుంబ్రిగుడ: బోల్తా పడిన కారు

మారేడుమిల్లి : మండలంలోని సున్నంపాడు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టింది. భద్రాచలం నుంచి నలుగురితో రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు సున్నంపాడు గ్రామ సమీప మలుపు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పింది. రోడ్డుపక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. కరెంట్ స్తంభం విరిగి కారుపై పడింది. విద్యుత్ తీగలు కారుకు తగలకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కారులో ఉన్న నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారని స్థానికులు తెలిపారు.

తొమ్మిది మందికి స్వల్ప గాయాలు

డుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయతీ నారింజవలస గ్రామ సమీపంలోని అరకు–పాడేరు ప్రధాన రోడ్డు మార్గంలో ఎదురుగా వస్తున్న ఆటోను పర్యాటకుల కారు ఢీకొట్టింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనలో రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. చాపరాయి జలపాతానికి కారులో వచ్చిన పర్యాటకులు తిరిగి అరకు వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోలో ఉన్న ఆరుగురు గిరిజనులకు, కారులోఉన్న ముగ్గురు పర్యాటకులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న దృశ్యం

వీఆర్ పురం: అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని సీతంపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముత్యాల చినవెంకటేష్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం కూలి పనికి వెళ్లాడు. కొంత సమయం తరువాత ఇంట్లో మంటలు చెలరేగాయి .ఇది గమనించిన స్థానికులు ఇంటిపై నీళ్లు పోసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్‌ఐ బి.వెంకటేష్ అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పారు. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న ఇంటి యజమాని వచ్చేసరికి పూర్తిగా దగ్ధమైన ఇల్లు దర్శనమిచ్చింది. ఇంట్లో రూ.50 వేలకు పైగా నగదు, బంగారు ఆభరణాలు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతైనట్టు బాధిత కుటుంబసభ్యులు వాపోయారు. ఆదుకోవాలని వారు కోరారు.

అమ్మవారికి బోనాల సమర్పణ

యలమంచిలి రూరల్: మార్గశిర మాసం తొలి శుక్రవారం నాడు వందలాది మంది మహిళా భక్తులు అమ్మవారికి ఘనంగా బోనాలు, సారె సమర్పించారు. పట్టణ వీధుల్లో బోనాలు, సారెను మంగళవాద్యాల నడుమ ఊరేగించి, అమ్మవారి ఆలయానికి వెళ్లారు. అక్కడ ప్రత్యేక హారతులు, అమ్మవారికి అభిషేకాలు, పసుపు,కుంకుమలు సమర్పించారు. బోనాల్లో ఉన్న నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. బోనాల ఊరేగింపు సందర్భంగా మహిళలు,బాలికలు కోలాటమాడారు.ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పలువురు మహిళలు అమ్మవారికి చీర,గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

దేదీప్యమానం.. దీపోత్సవం



దీపాలంకరణలో శ్రీ స్వయంభూగౌరీశ్వరస్వామి ఆలయ ప్రాంగణం

- స్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద 40వేల దీపాలతో దీపోత్సవం
- హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తుల శరణుఘోష
- వేలాదిగా తరలివచ్చిన భక్త జనం

చోడవరం: శివనామస్మరణతో చోడవరం స్వయంభూ శ్రీ గౌరీశ్వరస్వామి ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వెలుగులతో ప్రకాశించింది. వంద కాదు వెయ్యి కాదు ఏకంగా 40వేల దీపాలతో శివాలయ ప్రాంగణంలో భక్తులు దీపోత్సవం నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అతిప్రాచీన దేవాలయాల్లో ఒకటైన చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో పవిత్ర కార్తీకమాసం, మార్గశిర మాసాలను పురస్కరించుకుని 40వేల దీపాలతో శుక్రవారం రాత్రి నిర్వహించిన దీపోత్సవం కనులపండువగా జరిగింది. శివ,అయ్యప్పస్వామి మాలధారులతో పాటు భక్తులు ఈ దీపోత్సవంలో వందలాదిగా పాల్గొన్నారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులంతా ముక్తకంఠంతో మహాశివుని స్మరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు, వేదపండితుల ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య మహాలింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగ దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లింగాకారం, నందీశ్వరుడు, త్రిశూలం, ఓంకారం, స్వస్తిక్, శ్రీ చక్రం ఆకారాలతో దీపాలను వెలిగించారు. ఆలయ రాజగోపురాలు, సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలను దీపాలతో అలంకరించారు. వేలాది దీపాలు ఒకేసారి వెలగడంతో ఆ ప్రాంతమంతా దేదీప్యమానంగా ప్రకాశించింది. చిన్నాపెద్దా తేడాలేకుండా అందరూ పెద్దసంఖ్యలో పాల్గొని దీపోత్సవాన్ని కనులారా తిలకించి పరవశించిపోయారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్‌గూనూరు సత్తిబాబు, ఉపసర్పంచ్ పుల్లేటి వెంకటరావు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు మూర్తి, లక్కుందాసు కుమారి, అత్తిలి జగన్, బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు వద్దాది నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, వైఎస్సార్‌సీపీ నాయకులు శరగడం చిమ్మినాయుడు, మారిశెట్టి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిని ప్రజలకు వివరిస్తాం

- నేటి నుంచి మూడు రోజుల పాటు పర్యటన
- ఈ నెల 16న భోగాపురం ఎయిర్‌పోర్టును పరిశీలిస్తాం
- మీడియాతో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఉత్తరాంధ్రలో అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మూడు రోజుల పాటు ఉత్తరాంధ్రలో పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు పర్యటించి ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ నెల 16న భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును, 17న విజయనగరం మెడికల్ కళాశాల, 18న మూలపేట పోర్టు పనులను పరిశీలించి ప్రజలకు వివరించే వినూత్న కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. శుక్రవారం ఎండాడ లా కాలేజ్ సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఉత్తరాంధ్రలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు హామీలే తప్ప వాటిని నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. ఉత్తరాంధ్రలో ప్రాజెక్టులు శంకుస్థాపనలకే పరిమితమయ్యాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం సమస్యకు శాశ్వత పరిష్కారం సీఎం వైఎస్ జగన్ చూపించారన్నారు. ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం హామీ నెరవేర్చారన్నారు. ఉద్దానంలో రూ. 750 కోట్లతో వైఎస్సార్ సుజల ధార ప్రాజెక్టు, రూ.85 కోట్లతో వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ అండ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు జాతీయ స్థాయి కాన్ఫరెన్స్

విశాఖ విద్య: సిమ్యుల్‌కాన్ ఫర్ అసెస్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ హెల్త్ ప్రొఫెషన్ ఎడ్యుకేషన్ పేరిట విశాఖలో రెండు రోజులు పాటు జాతీయ స్థాయిలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖలోని మెడ్‌టెక్ జోన్ కలామ్ కన్వెన్షన్ సెంటర్ (ప్రగతి మైదాన్)లో శని, ఆదివారం కాన్ఫరెన్స్ జరుగనుంది. దీనికి దేశ వ్యాప్తంగా ఉన్న పలువురు వైద్య, ఫార్మారంగ ప్రతినిధులు హాజరుకానున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం రుషికొండ గీతమ్ యూనివర్సిటీలో ముందస్తు వర్క్‌షాప్ నిర్వహించారు.

కొండ్రాజుపేటలో గ్రామసభ



గ్రామసభలో ఇంటి పత్రాలు చూపిస్తున్న ఎంపీపీ పాయం రంగమ్మ

కూనవరం: కొండ్రాజుపేట గ్రామపంచాయతీ పరిధిలో పోలవరం నిర్వాసితుల గృహాలకు సంబంధించిన ఆవార్డు ఎంక్వయిరీ గ్రామసభ నిర్వహించారు. నిర్వాసితుల నుంచి స్ట్రక్చర్ ప్యాకేజీకి అవసరమైన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను లబ్ధిదారుల నుంచి స్వీకరించారు. 149 మంది గృహ పత్రాలు ఇవ్వాల్సి ఉండగా నలుగురు హాజరు కాలేదు. ఇంటిపన్ను రశీదు, అధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు, విద్యుత్ బిల్లు రశీదు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో పాటు మూడు పాస్‌పోర్టు సైజు ఫోటోలను నిర్వాసితుల నుంచి పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కూనవరం యూనిట్ అధికారులు గ్రామసభలో తీసుకున్నట్టు సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ నాగబాబు, ఎంపీపీ పాయం రంగమ్మ, గుజ్జా మోహన్‌రావు, సర్వేయర్ బాలకృష్ణ, సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడతాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలో పద్మాపురం మేజర్ పంచాయతీ కేంద్రంలో విశాఖపట్నానికి చెందిన ఏబీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని నిర్వహించి 200 మంది పేద వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ముఖ్య అతిథిగా పాల్గొన్ని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలలో పేదలకు వివిధ స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టు నిర్వాహకులు, దాతలు ఉచిత సేవలు, నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు తమ వంతు సాయమందిస్తామన్నారు. ఏబీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ స్వరూప్, ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్ సుస్మిత, నాయకులు సుంక్ర, రాజ్‌కుమార్, నర్సింగ్, ట్రస్ట్ సిబ్బంది జయరాజ్, బాలరాజు, వెంకట్, శివ, రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీల్లో రెండు పతకాలు



ప్రతిభ కనబరచిన నాగవెంకటదుర్గ

ఎస్.రాయవరం: రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీల్లో ఎస్.రాయవరం ఉన్నత పాఠశాల విద్యార్థిని సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించినట్టు పీడీ కె.శ్రీను తెలిపారు. ఎస్.రాయవరానికి చెందిన తూము నాగవెంకట దుర్గ ఈ నెల 12,13,14 తేదీల్లో పల్నాడు జిల్లా నర్సారావుపేట డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ కనబరచినట్టు చెప్పారు. అండర్ 17 విభాగంలో 400 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్ మెడల్, 1500 మీటర్ల పరుగుపందెంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్టు చెప్పారు.రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచిన నాగవెంటక దుర్గను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు



రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులతో జాతీయ స్థాయికి ఎంపికైన ఆనందపురం కేజీబీవీ విద్యార్థినులు

విశాఖ విద్య: విశాఖ జిల్లా ఆనందపురం కేజీబీవీ విద్యార్థులు 'థింసా నృత్యప్రదర్శన' లో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న 15 మంది విద్యార్థినులు గిరిజన సంప్రదాయ థింసా నృత్యప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని ప్రకటించి, సర్టిఫికెట్లు అందజేశారు. బాల్‌రంగ్-2023 పేరిట మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్ గౌతమ్ నగర్‌లో ఈ నెల 21న జరిగే జాతీయ స్థాయి పోటీల్లో మన జిల్లా విద్యార్థినుల థింసా నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు. నృత్య పోటీల్లో పాల్గొన్న 15 మంది విద్యార్థినులతో పాటు వీరికి సహాయకులుగా కేజీబీవీ ప్రత్యేకాధికారి ఖాలేషా బేగంతో పాటు, మరో నలుగురుకు భోపాల్ వెళ్లే అవకాశం లభించింది. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులను పలువురు అభినందించారు.

తాండవ సుగర్స్ ఎండీగా ప్రసాదరావు

పాయకరావుపేట: తాండవ చక్కెర కర్మాగారం ఎండీగా పి.ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చోడవరం సుగర్ ఫ్యాక్టరీలో ప్రసాదరావు చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసేవారు. ప్రస్తుతం తాండవ చక్కెర కర్మాగారం ఎండీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

గోవాడ సుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం



గోవాడ సుగర్స్‌లో కేన్ క్యారియర్ వద్ద చెరకు గెడలు వేసి క్రషింగ్ ప్రారంభిస్తున్న ఎండీ సన్యాసినాయుడు, సిబ్బంది

- ఈ ఏడాది 2 లక్షల టన్నుల గానుగాట లక్ష్యం
- టన్ను చెరకుకు రూ.2,920 మద్దతు ధర
- గోవాడ ఎండీ సన్యాసినాయుడు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ లాంఛనంగా ప్రారంభమైంది. ఫ్యాక్టరీ కేన్ క్యారియర్ వద్ద ఎండీ వి. సన్యాసినాయుడు, యాజమాన్య అధికారులు, కార్మికులు కలిసి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కేన్ క్యారీయర్‌లో చెరకు గెడల కట్టలు వేసి క్రషింగ్ ప్రారంభించారు. అనంతరం ఎండీ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 22 మధ్యలో రెగ్యులర్ క్రషింగ్ చేపడతామన్నారు. ఈ ఏడాది 9.5 శాతం రికవరీ వస్తే టన్నుకు రూ.2,920 చొప్పున ఇస్తామన్నారు. ఈ సీజన్‌లో రెండు లక్షల టన్నుల చెరకు గానుగాట చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఫ్యాక్టరీ పరిధితోపాటు తాండవ, ఏటికొప్పాక ఫ్యాక్టరీల పరిధిలో చెరకును గానుగాట చేయాలని నిర్ణయించామన్నారు. ఆ రెండు ఫ్యాక్టరీల పరిధిలో చెరకు సాగు కేవలం 25 వేల టన్నులకు మించి ఉత్పత్తి అయ్యే అవకాశం లేదన్నారు. దీనివల్ల ఆ చెరకును అక్కడ రైతులకు ఇబ్బంది కలుగకుండా తీసుకునేందుకు కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నామన్నారు. గోవాడ ఫ్యాక్టరీ పరిధిలో చెరకు కటింగ్ పర్మిట్లు ఇచ్చిన 48 గంటల్లోగా సరఫరా చేయాలని, లేనిపక్షంలో వాటిని రద్దు చేస్తామన్నారు. రస నాణ్యతను బట్టి కటింగ్ ఆర్డర్లు రైతులకు ఇస్తామన్నారు. ఒకే చోట రైతులు గ్రూపుగా ఉండి చెరకు వేస్తే వారందరికీ ఒకే సారి కటింగ్ పర్మిట్లు ఇచ్చే విధానాన్ని అమలులోకి తెచ్చామన్నారు. ఏటా మాదిరిగానే రైతులకు అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ఒంటి కన్ను ముచ్చు విత్తనం ఇవ్వడంతోపాటు మంచి రికవరీ వచ్చే చెరకు విత్తనాలను ఈ ఏడాది రైతులకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేవీవీ భాస్కరరావు, కార్మిక సంఘం నాయకుడు శరగడం రాము నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలకు 30 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ చూపిన 30 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ వనం సన్యాసిరావు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-11, అండర్-14, అండర్-18 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో బి.బి.పట్నం, కొమరవోలు, బుచ్చింపేట, రోలుగుంట మండలాల నుంచి 100 మంది పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన 30 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను ఇన్‌చార్జి హెచ్‌ఎం శర్మ, టీచర్ కిరణ్ ప్రారంభించారు. ఈనెల 24,25 తేదీల్లో చిత్తూరులోని టీటీడీ కల్యాణమండలంలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయి. రోలుగుంటలలో జరిగిన ఎంపిక పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయులు కె.సావిత్రి(బి.బి.పట్నం) ఎల్.రాజులమ్మ(కొమరవోలు) బి.కొండలరరావు(బుచ్చింపేట) ఎస్.గోవింద(రోలుగుంట) పాల్గొన్నారు.

ఘనంగా అప్పన్న తిరువీధి



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు మూడోరోజు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన అయ్యవారి సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామివారి నామస్మరణలో మునిగితేలారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకీలో అధిష్ఠింపజేశారు. ఆలయ బేడా మండపంలో విశేషంగా తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆస్థానమండపంలో అధిష్ఠింపజేసి దివ్యప్రబంధ పారాయణాలు పఠించారు.

సహకార వ్యవసాయం.. లాభదాయకం



ప్రసంగిస్తున్న డాక్టర్ రామాంజనేయులు



హాజరైన రైతులు

ఏయూక్యాంపస్: రైతులంతా సమష్టి సహకార పద్ధతిలో వ్యవసాయం చేయాలని అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వి.రామాంజనేయులు కోరారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఆర్గానిక్ గ్రాడ్యుయేట్ రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రసాయన వ్యవసాయానికి ఎంత రాయితీ ఇస్తున్నారో.. అంతే రాయితీని ప్రకృతి వ్యవసాయ రైతులకు ఇవ్వాలని ఆయన కోరారు. దీని వలన ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. రైతులకు శాస్త్రీయ అవగాహనకు శిక్షణ అందిస్తున్నామని.. తమ సంస్థ హెల్ప్ లైన్ నంబర్ 85009 83300ను వినియోగించుకోవాలని కోరారు. పంటలో వచ్చే తెగుళ్లను గుర్తించడానికి పెస్టోస్కోప్ యాప్‌ను వినియోగించాలని సూచించారు. ఆగ్రో డీఎస్‌ఏ వ్యవస్థాపకుడు నరేంద్ర నెల్ల మాట్లాడుతూ తాము పంట భూమిని పరీక్షించి.. దాని ఆధారంగా పంటలకు ఎలాంటి పోషకాలు అందజేస్తున్నామో వివరించారు. ప్రతీ రైతు తాను పండించే నేల గురించి అవగాహన పెంచుకుని.. ప్రకృతి ఆధారిత పంటలు పండించడం, అధిక దిగుబడులు సాధించాలన్నారు. వ్యవసాయంలో మార్కెటింగ్ కూడా ప్రధాన అంశమని, టెక్నాలజీ వినియోగించి.. బ్రాండ్ ఇమేజ్ పెంచుకుంటూ పంటను విక్రయించాలన్నారు. గ్రాడ్యుయేట్ రైతు సతీష్ గద్దె మాట్లాడుతూ వ్యవసాయానికి పశువులే ప్రధానమన్నారు. ఏకవార్షిక పంట మంచి ఫలితాలిస్తోందన్నారు. వ్యవసాయానికి అనుబంధంగా పశువుల పెంపకం చేపట్టాలన్నారు. రైతు సాధికారత సంస్థ ప్రతినిధి కె.ప్రభాకర్ మాట్లాడుతూ తమ సంస్థ 3,500 గ్రామాల్లో ప్రకృతి ఆధారిత పంటలు పండించే రైతులకు సహకారం అందిస్తోందన్నారు. రైతులు మండల స్థాయిలో పనిచేసే తమ ప్రతినిధులును సంప్రదించాలని సూచించారు. గ్రాడ్యుయేట్ రైతుల సమావేశం అధ్యక్షుడు చెరుకూరి రిషి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ రైతుల సంఖ్య పెరుగుతోందన్నారు. మార్కెటింగ్ విషయంలో చాలా సంస్థలు ముందుకొస్తున్నాయని, ప్రకృతి ఆధారిత పంటలు పండించే రైతులను పెంచుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్, భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమారస్వామి, ఆర్‌ఎస్ఎస్ రాష్ట్ర ప్రతినిధి జనార్దన్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పెరి రామకృష్ణ రావు, ఆర్‌వైఎస్ఎస్ ప్రతినిధి కృష్ణారావు, గో-ఆధారిత ప్రకృతి రైతు సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్య వర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్ కుమార్, సత్త్వ నేచురల్స్ మధుసూదన రెడ్డి, అవని ఆర్గానిక్స్ ప్రతినిధి ఉషా గజపతి రాజు, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, మేకా ప్రతినిధులు సాయిబాబు, గో-ఆధారిత ప్రకృతి రైతు సంఘం రాష్ట్ర నాయకుడు పి.ఎల్.ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.